# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# వన మహోత్సవం..

- మనిషి జీవితంలో అతి ముఖ్యమైనవి వృక్షాలే : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- మన్యంకొండ శ్రీ అలివేలు మంగమ్మ దేవాయ ఆవరణలో మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 02 ప్రభాతవార్త :** మనిషి జీవితంలో అతిముఖ్యమైనవి వృక్షాలే అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.మంగళవారం మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని మన్యంకొండ శ్రీ అలివేలు మంగమ్మ దేవాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని అటవిశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ వన మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లా పరిషత్ ఛైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి చెట్లు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాకు లక్షల టార్గెట్ నిర్ణయించారని, గతంలో మాదిరిగా రికార్డుల కోసం కాకుండా ప్రతి చెట్టును బతికించేందుకు ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉందని, అందుకే సామాజిక కార్యకర్తలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఆరు సంవత్సరాల పిల్లవాడి మొదలు 60 సంవత్సరాల వారి వరకు ప్రతి వర్గం – మిగతా4లో..

# ట్యాంక్‌బండ్‌ను సందర్శించిన కలెక్టర్

- పనుల పురోగతిపై ఆరా..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 2, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రలోని మినీ ట్యాంక్‌బండ్(పెద్దచెరువు)ను కలెక్టర్ విజయేంద్ర బోయి సందర్శించారు. ఈమేరకు మంగళవారం ఆమె ట్యాంక్‌బండ్, మినీ శిల్పారామాన్ని పరిశీలించారు. గతంలో చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈమేరకు చేపట్టాల్సిన పనులపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆమెవెంట అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్,మున్సిపల్ కమషనర్ మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



శిల్పారామాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# పోడు భూములపై హక్కు కల్పిస్తాం...

- సాగు భూములను కొనసాగించాలని కలెక్టర్ డీఎఫ్‌ఓలకు ఆదేశం
- విద్యా, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట...
- సంస్కారంతో కూడిన విద్యను అందించాలి...
- 3.50కోట్లతో నిర్మించిన కేజీబీవీ పాఠశాల ప్రారంభం
- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి...
- మహిళా సంఘాలకు రూ.50.10కోట్ల వడ్డీ లేని రుణాలు
- పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క

**అచ్చంపేట, జూలై 02 ప్రభాతవార్త:**నల్లమల్ల ప్రాంతంలో తిండి తిప్పలు లేక అవస్థలు పడుతూ జీవనం కొనసాగిస్తున్న చెంచులకు వారు సాగు చేసుకునే పోడుభూములపై హక్కు కల్పించి వారి జీవనోపాధికి మనుగడ అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క పేర్కొన్నారు. చెంచులు సాగు చేస్తున్న పోడుభూముల్లో చెంచులకే పూర్తి హక్కులు అందించాలని కలెక్టర్, డీఎఫ్ఓలకు మంత్రి సూచించారు. మంగళవారం నల్లమల్ల ప్రాంతంలో పర్యటించిన పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క మన్ననూరు అతిథి గృహంలో చెంచులతో ముఖాముచ సమావేశాన్ని నిర్వహించారు. కొత్తగా చెట్లను నరికి సాగు చేయవద్దని చెంచు ప్రజలకు తెలిపారు. అడవిని కాపాడటంతో అడవి సంపదతో వనరులను సృష్టించుకోవాలని ఆమె సూచించారు. ఇందిరాగాంధీ, నెహ్రూ ఐటీడీఎలను ఏర్పాటు చేసి ఎస్టీలుగా గుర్తింపు తీసుకొచ్చి పోడు భూములను సాగు చేసుకునే హక్కు, రిజర్వేషన్లు అనేక చట్టాలు ఏర్పాటు చేశారని ఆమె గుర్తు చేశారు. నల్లమల్ల బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఐటీడీఎలు వెనుకబాటుకు గురయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చెంచు ప్రజలకు సరైన వైద్యం, ఆహారం, విద్య, ఇండ్లు ఉండేలా ఏర్పాట్లు చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు వృత్తిరీత్య వైద్యులు అయిన వంశీకృష్ణ దంపతులు నల్లమల్ల ప్రజలకు ఎంతో సేవలు చేస్తున్నారని ఆమె గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే జాతుల్లో చెంచు జాతి కూడా ఉందని, ఆ జాతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు. పోడు భూముల విషయంలో అధికారులు, చెంచు ప్రజలు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని, చెంచు ప్రజలు తమ పొలాల్లో హార్టికల్చర్ విధానంతో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అడవిని కాపాడుకోవడంతో చెంచులకు జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. నల్లమల్ల ప్రాంతం చెంచుల అభివృద్ధికై ఎమ్మెల్యేతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**విద్యా, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట...**

విద్యా, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, విద్యార్థులకు సంస్కారంతో కూడిన విద్యను అందించాలని పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క అన్నారు. అమ్రాబాద్ మండలంలో తెలుగుపల్లి గ్రామంలో రూ.3.50కోట్ల నిధులతో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కస్తూర్బా పేరిట అందమైన అత్యాధునికమైన నూతన విద్యాలయంగా నల్లమల్ల ప్రాంతంలోని తెలుగపల్లి కేజీబీవీ నిలిస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నారని, అనడానికి ఈ దేశాన్ని పాలించిన ఇందిరమ్మ, ఈ దేశానికి మొదటి రాష్ట్రపతిగా ఒక ఆదివాసీ మహిళ ఉన్నారని, ప్రతి రంగంలో మహిళలు ముందంజలోకి వస్తున్నారని ఆమె గుర్తు చేశారు. ఆడవాళ్లు బయటకు రావొద్దు.. విద్య నేర్పించవద్దని అనాటి దురాచారాల మీద పోరాటం చేసిన మహనీయుడు జ్యోతిరావుపూలే సతీమణి, సావిత్రిబాయిపూలే మనకు విద్యను –మిగతా2లో..



చెంచులతో మాట్లాడుతున్న మంత్రివర్యులు దనసరి సీతక్క



కస్తూర్బా నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న సీతక్క

## కొత్త చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి..

- కొత్త చట్టాల ప్రకారం రాజోలి పోలీస్ స్టేషన్‌లో మొదటి కేసు నమోదు : జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు

**గద్వాల ప్రతినిధి జులై 2 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా పరిధిలోని రాజోలి మండల కేంద్రానికి చెందిన బటికేరి శ్రీనివాసులు అను వ్యక్తి 01 జులై అనారోగ్య సమస్యలు, కుటుంబ సమస్యల వల్ల జీవితం పై విరక్తి చెంది సుంకేసుల డ్యాంలో దూకి చనిపోవడం జరిగింది. అతని కుమారుడు బటికేరి భసవరాజు ఫిర్యాదు మేరకు 1 జులై నుండి భారతదేశ కొత్త చట్టాలు అమలు కావడంతో జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు,



జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

ఆదేశాల మేరకు రాజోలి ఎస్సై జగదీశ్ సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్, భారతీయ నాగరిక సురక్ష సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండేందుకు విడతల వారీగా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని సిబ్బందికి, అధికారులకు ఓరియెంటెడ్ తరగతులు నిర్వహించి – మిగతా2లో..

## అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాట్లు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి జులై 02 ప్రభాతవార్త :** అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాట్ల పై జిల్లా సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఎక్కడెక్కడ మరుగుదొడ్లు, తాగునీటి వసతి అవసరం ఉందో గుర్తించి వాటిలో వేగంగా నిర్మాణాలు ప్రారంభించాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతకు సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి సప్విస్తూ 154 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, 50 కేంద్రాల్లో తాగునీటి వసతి, 10 కేంద్రాల్లో అప్గ్రేడషన్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఆయాకేంద్రాల్లో వెంటనే పనులు ప్రారం భించాలి కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వారం గడువులోపు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వేగవంతంగా, నాణ్యతగా పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమధికారి లక్ష్మి బాయి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, సీడిపిఓలు, సూపర్‌వైజర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తాం..

### కళ్యాణలక్ష్మి పథకానికి డబ్బులు అడిగితే నాకు చెప్పండి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 02 ప్రభాతవార్త :** అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పని చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 42 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందించి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల కుప్పగా మారిందని, అయినప్పటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సారథ్యంలో కళ్యాణలక్ష్మికి సంబంధించిన చెక్కులకు ఏ విధమైన ఆటంకం కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుని మంగళవారం ఆడబిడ్డల తల్లులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఏ తల్లి తండ్రి కూడా ఆడబిడ్డలకు పెళ్లిచేసి అప్పుల పాలు కాకూడదనే మంచి ఆలోచనతో చెక్కులను లబ్దిదారులకు అందించడం జరిగిందని ఆయన చెప్పారు. కళ్యాణలక్ష్మి,షాదీముబారక్‌ల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే తమ క్యాంపు కార్యాలయంలోని సిబ్బందికి తెలియజేయాలని ఆయన చెప్పారు. మధ్యలో చదువు ఆపి పెళ్ళిళ్ళు చేసుకున్న మీ పిల్లలకు ప్రభుత్వ కళాశాలల్లో ఉన్నత చదువులు చదివించాలని, వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడే విధంగా మీరు కృషి చేయాలని ఆయన లబ్దిదారులకు సూచించారు. ఈ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు మహిళల కోసం తీసుకొస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ గ్రామీణ తహసిల్దార్ సుందర్‌రాజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లు నర్సింహ్మారెడ్డి, ఎంపిటిసి నాగరాజు, గోవింద్‌యాదవ్, ధర్మాపూర్ నర్సింహ్మారెడ్డి, మేఘారెడ్డి, మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

## తండ్రీకూతురు మృత్యువాత..

- ఆత్మహత్య చేసుకోబోతున్న తండ్రిని కాపాడబోయిన కూతురు
- రైలు ఢీకొని ఇద్దరు దుర్మరణం
- మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేటలో ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 2, ప్రభాతవార్త :** కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకోబోతున్న తండ్రిని కాపాడబోయి కూతురు కూడా మృత్యువాత పడ్డ ఘటనలో మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. నవాబుపేట మండలం చౌడాపూర్ గ్రామానికి చెందిన శివానంద్(52) మహబూబ్‌నగం ఏనుగొండలోని ఎస్‌వీఎస్ దవాఖాన యజమాని కారు డ్రైవర్‌గా పని చేస్తు న్నాడు. తన కూతురు చందన కూడా అదే దవాఖానలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నది. అయితే కుటుంబ కలహాలతో శివానంద్ సోమవారం రాత్రి ఆత్మహత్య చేసు కునేందుకు రైలు పట్టాలపైకి వెల్లాడు. గమనించిన కూతు రు చందన తండ్రిని బతిమిలాడి కాపాడడానికి వెళ్లింది. అదే క్రమంలో రైలు రావడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. తండ్రికూతురు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



శివానంద్ ( ఫైల్)



చందన (ఫైల్)

## పీయూలో రవాణా నమూనాల ప్రదర్శన



3లో..

నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు పురుగుల అన్నం...!

- ఆస్పత్రిలో రోగులకు పెడుతున్న ఆహారంలో నాణ్యత లోపం...!
- తుంగల తొక్కిన టెండర్ అగ్రిమెంట్...!
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డైట్ కాంట్రాక్టర్ ....!
- పేరుకే డైట్ మెను ., అడుగుతే దురుసుగా సిబ్బంది సమాధానం...!
- చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న వైద్య అధికారులు...!
- అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తే... పురుగుల అన్నంతో మరో సమస్యలు...!

**వనపర్తి ప్రతినిధి జులై02 ప్రభాతవార్త :** ఆస్పత్రిలో చికిత్స వచ్చే రోగులకు వారి సహాయకులకు పురుగుల అన్నం పెడుతున్న సంఘటన ఆదివారం జనరల్ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. అనారోగ్యంతో ఆసు పత్రికి వచ్చిన రోగులను పోషక విలువలతో కూడిన మెనూ పెడుతామన్న కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరుపై బాధిత సహాయకులు ఆవేదన వెళ్ళిబుచ్చుతున్నారు. ఎన్నో నిబంధనలతో రోగులకు అందించే ఆహారం నాణ్యతంగా ఉండాలని ప్రభుత్వం జారీ చేసిన టెండర్ కాపీలో ఉన్నప్పటికి ఆ నిబంధనలకు విరుద్ధంగా ఏం చేసినా చెల్లుతుంది. అన్ని కాంట్రాక్టర్ నిర్వాహకం వల్ల రోగులు సహాయకులు పురుగుల అన్నంతో తంటాలు పడుతున్న పరిస్థితి నెలకొంది.ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పెట్టిన అన్నంలో పురుగులు కనిపిస్తుండడం రోగులు పెట్టిన అన్నంని పడేసిన పరిస్థితి.ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్లకు నచ్చినట్లు వడ్డిస్తే ఇలాంటి సంఘటనలు జరిగినవారు పట్టించుకోరు అన్న తీవ్రమైన ఆరోపణలు గట్టిగ వినిపిస్తున్నాయి. డాక్టర్లకు ప్రత్యేకంగా వడ్డిస్తున్న కాంట్రాక్టర్ నిర్వహకులు అదే తీరుగా రోగులకు ఎందుకు వడ్డిస్తాలేరని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అన్నీ తెలిసిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోరుమెదపకపోవడం, పర్యవేక్షించడం వెనక ఉన్న ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.






**కాంట్రాక్టర్ హైదరాబాద్ నుంచి మానిటరింగ్...**

ప్రభుత్వ ఆసుత్రిలో, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రోగులకు, బాలింతలకు, చిన్నారులకు – మిగతా2లో..

### కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుంటాం

రోగులు అందించే ఆహారంలో లోపం జరుగుతే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం, గతంలో ఒకసారి షోకాజ్ నోటీసులు జారీ చేశాం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా రెండు నెలల తర్వాత దానికి సమాధానం ఇవ్వడం జరిగింది, కాంట్రాక్టర్‌కి చెప్పిన తర్వాత ఒక వారం రోజులు మెనూ పాటిస్తారు, ఆ తర్వాత యధావిధిగా వారికి నచ్చినట్లు చేస్తుంటారు.



*డాక్టర్ రంగారావు జిల్లా జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్.*

## బీట్ అధికారుల కృషి అభినందనీయం

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**హన్వాడ మండలం పిల్లిగుండులో నివాస భవనం ప్రారంభం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 02 ప్రభాతవార్త :** ఫారెస్టు బీట్ అధికారుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఫారెస్టు బీట్ అధికారుల కోసం హన్వాడ మండలం పిల్లిగుండు గ్రామంలో నిర్మించిన నివాస భవనానికి ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించి రిబ్బన్ కట్‌చేసి బీట్ ఆఫీసర్ నివాస భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. అడవుల సంరక్షణ కోసం ఫారెస్టు బీట్ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని, అడవుల సంరక్షణ కోసం అనుక్షణం ఎంతో కష్టపడుతున్నారని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని ఎదుర్కొని సమాజం బాగుపడాలంటే అడవులు బాగుండాలనే ఆశయంతో బీట్ అధికారులు 24/7 పని చేస్తున్నారని ఆయన అభినందించారు. అనంతరం 75వ వన మహోత్సవం సందర్భంగా బీట్ ఆఫీసర్ నివాస భవనంలో, చిన్నదర్పల్లి ఫారెస్టులో అధికారులు, ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి అడవులను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డిఎఫ్ఓ సత్యనారాయణ, డిఆర్‌డిఓ నర్సింహులు, ఎంపిపి బాల్‌రాజు, ఎంపిటిసి మునెమ్మ, అధికారులు పాల్గొన్నారు.



భవన ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

## పోడు భూములపై హక్కు కల్పిస్తాం...

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అందించడం కోసం ప్రారంభించిన పాఠశాలలో విద్యను బోధిస్తే ఆడవాళ్లకు విద్య చెప్పే విధంగా ఆ రోజు చేసిన ప్రయత్నం ఈ రోజు మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించడం కోసం జరిగిందని ఆమె పేర్కొన్నారు. కస్తూర్బా పాఠశాలకు ప్రహరిగోడ, సీసీ రోడ్డు నిర్మించాలని మంత్రి సీతక్కను పాఠశాల అధ్యాపకులు కోరడంతో ఆమె నిధుల నుంచి తక్షణమే మంజూరు చేస్తున్నానని మంత్రి హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ నీళ్లను పాఠశాలకు అందించి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు తాగునీటి సమస్య లేకుండా చేస్తామని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులే నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య, దుస్తులను అందించి పేదింటి బిడ్డలకు సంస్కారంతో కూడిన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోందని ఆమె గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అమ్రాబాద్ మండల కేంద్రంలో రూ.20లక్షల నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరిగోడ నిర్మాణానికి మంత్రి సీతక్క చేతుల మీదుగా శంకుస్థాపన చేపట్టారు. రాయలగండి గ్రామంలో రూ.33లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర శాఫ్ చైర్మన్ శివసేనరెడ్డి, జెడ్పీటీసీ అనురాధ, డీఈఓ గోవిందరాజులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.



అమ్రాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరిగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రివర్యులు దనసరి సీతక్క

### జిల్లా జనరల్ ఆస్పత్రిలో

## రోగులకు పురుగుల అన్నం...!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అందించే ఆహారం మెనులో ప్రతిరోజు చిల్డ్రన్ వార్డులో ఉన్న పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్స్ గర్భిణీలకు మూడు గుడ్లు , అరటి పండ్లు ఇవ్వాలని అగ్రిమెంట్ కాపిలో ఉన్న నిబంధనలను తుంగలో తొక్కి నీళ్ల చల్ల విధంగా నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ పై వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నీలి నీడల్లో నడుస్తుందన్న ఆరోపణ నిజం చేస్తున్న పరిస్థితి. వారు పెట్టింది తినాలి చెప్పిందే చేయాలి అన్న తీరుగా కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నంత వరకే ఆయన చేసిన ప్రయత్నాలు...వంట కూలీలతోనే నిర్వహిస్తూ హైదరాబాద్ నుంచి మానిటరింగ్ చేసే పరిస్థితి కనిపిస్తోంది. కాంట్రాక్టర్ తరపున సిబ్బంది ఉన్న ఆరోపణలు మాత్రమే స్పందించండి లేని పక్షంలో ఎలాగైనా నెట్టుకు రండి అని అక్కడ పనిచేసే వంట వాళ్లకి ఆదేశించినట్లు సమాచారం, దృష్టిపెట్టి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని అక్కడ ఉన్న బాలింతలు వారితో పాటు వచ్చే బంధువులు వాపోయారు.

### కొత్త చట్టాలను పకడ్బందీగా

## అమలు చేయాలి..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

100 శాతం సిబ్బందికి, అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. కొత్త చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయడంతో పాటు పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని అలాగే కొత్త చట్టాల ఎస్ఓపిసీ అనుసరించి విచారణ చేపట్టడం, సాక్ష్యాదారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జీ షీట్ వేయడం జరుగుతుందని అన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం మరియు వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్దవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందని అన్నారు. కొత్త చట్టాల వర్తింపు నేరాలు దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అలాగే రైటర్స్‌కు ఏలాంటి సందేహాలు ఉన్న జిల్లా నుండి శిక్షణకు వెళ్లి వచ్చిన ఎక్ఫర్ట్ ఉన్నతాధికారులను సంప్రదించి ముందుకెళ్లే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## నూతన ఎస్సైగా శ్రీకాంత్

**కోయిల్‌కొండ, జులై 02 ప్రభాతవార్త :** కోయిల్‌కొండ నూతన ఎస్సైగా మంగవారం శ్రీకాంత్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఎస్సై శ్రీకాంత్ గద్వాల జిల్లా నుండి కోయిల్‌కొండకు బదిలీపై వచ్చారు. పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నూతన ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ కోయిల్‌కొండ మండలాన్ని ప్రజలందరి సహకారంతో ప్రశాంత వాతారణంలో ముందుకు తీసుకెళ్తామని ఎస్సై తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.




## బాలానగర్ తై బజార్ వేలం పాట

**5,47,500 రూపాయలకు దక్కించుకున్న జోగిని శేఖర్**

**బాలానగర్, జులై 02 ప్రభాతవార్త :** తై బజార్ వేలంపాట మంగళవారం హోరాహోరీగా కొనసాగింది. బాలానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఓ, ఎంపిఓ, ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన తైబజార్ వేలం పాటలో గ్రామానికి చెందిన జోగిని శేఖర్, అస్మా సుల్తానా, కటవోత్ జగదీష్, బోయ కిరణ్, భాగం నరసింహ, పోచమోని శ్రీనివాస్ ఈ వేలం పాటలో పాల్గొన్నారు. చివరికి 5,47,500 రూపాయలకు బాలానగర్ తైబజార్ వేలంను జోగిని శేఖర్ దక్కించుకున్నారు. రెండవ స్థానంలో మైనార్టీ మహిళా అస్మా సుల్తానా నిలిచారు.



## ఆగస్టు 31వరకు డయేరియా క్యాంపెయిన్

**స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించిన కలెక్టర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 02 ప్రభాతవార్త :** ఐదు సంవత్సరాలలోపు పిల్లలలో డయేరియా మరణాలు నివారించుటకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలో రామయ్యబౌలి అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను జిల్లా కలెక్టర్ పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, జింక్ సిరప్ అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అర్బన్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న ఐదు సంవత్సరాల పిల్లలకు ఏ ఒక్కరు కూడా డయేరియా గురి కాకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా జులై 1వ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా క్యాంపెయిన్ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిహెచ్‌సిలు, అర్బన్ హెల్త్ సెంటర్‌ల పరిధిలో ఉన్న ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న గృహాలను ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గుర్తించనున్నట్లు తెలిపారు. ప్రతి గృహంలో ఓఆర్ఎస్ ప్యాకెట్ అందజేసి ఓఆర్ఎస్ ప్యాకెట్ ఏ విధంగా ద్రావణాన్ని కలపాలి ఎంత మోతాదుల కలపాలి అవగాహన కలిగిస్తూ అన్ని గృహాలను సందర్శించి ప్యాకెట్లు అందజేస్తారని తెలిపారు. ఒక గృహంలో ఒక బాబు ఉంటే ఒక ప్యాకెట్ ఇద్దరు ఉంటే రెండు ప్యాకెట్లు ఆ విధంగా ఆ పరిధిలో ప్రతి ఆశ కార్యకర్త ప్రతి ఆరోగ్య కార్యకర్త గృహ సందర్శన చేసి ఈ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు ఈ ఓర్ఎస్ ప్యాకెట్, జింక్‌పైన అవగాహన కలిగిస్తారని తెలిపారు. ప్రతి అంగన్‌వాడి కార్యకర్త దగ్గర ఉన్న పిల్లలకు, అంగన్‌వాడి పరిధిలో ఉన్న తల్లిదండ్రులకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌పై జింక్ సిరప్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో జింక్ ఓఆర్ఎస్ కార్నర్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని వచ్చిన వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.కె. కృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిడా. శంకర్ బిలకంటి, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. శ్రీధర్‌రెడ్డి, జిల్లా పిఓడిటి అధికారి డా. శశికాంత్, జిల్లా మలేరియా అధికారి డా. భాస్కర్‌నాయక్, జిల్లా కుష్టు నివారణ అధికారి డా. జరీనా భాను, అర్బన్ హెల్త్ సెంటర్ డా. గౌతమి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వార్డు కౌన్సిలర్ రషీద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.




పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న కలెక్టర్

### చదువు నేర్పాలని ఆశయంతో ముందుకు సాగుదాం

## అందరికి చదువు.. అందరి బాధ్యత

**వయోజన విద్య జిల్లా ప్రాజెక్టు అధికారి కే.అనిత**

**గద్వాల ప్రతినిధి జులై 2 ప్రభాతవార్త:** ప్రజలందరూ అక్షరాస్యులైనప్పుడే అభివృద్ధి ఫలాలు అందరికి సమానంగా అందుతాయని వయోజన విద్య జిల్లా ప్రాజెక్టు అధికారి కే.అనిత అన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరు ఇంకొకరికి చదువు నేర్పాలని ఆశయంతో ముందుకు సాగుదామని వయోజన విద్య జిల్లా ప్రాజెక్టు అధికారి కే.అనిత అన్నారు. మనదేశంలో స్వాతంత్ర్యం రాకముందు నుండి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా రకరకాల పేర్లతో అక్షరాస్యతా కార్యక్రమాలు జరిగాయి అన్నారు. ఎన్నో కోట్ల మందిని అక్షరాస్యులుగా చేశామన్నారు. అయితే ఇంకా ఇప్పటికి చదువురానివారు చాలా మంది ఉన్నారు. ఈ సంఖ్య ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉందన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో 37.75 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నారని, ఈ జిల్లాలో లక్షా 85వేల మంది ఉన్నారు అన్నారు. వారందరినీ దశలవారీగా అక్షరాస్యులు చేయాలనేదే మన ప్రభుత్వాల సంకల్పం అన్నారు. ప్రస్తుతం సమాజంలో అక్షరాస్యత అవశ్యకత అన్ని విషయాలలో ప్రస్ఫూటంగా కనిపిస్తోందన్నారు. ఎందుకంటే ఇప్పుడంతా డిజిటల్ యుగం నడుస్తుందని , మరి ఈ యుగంలో ప్రతి ఒక్కరు అక్షరాస్యులైతేనే మన దేశం, రాష్ట్రం, మన జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2022, 2027 న 5 సంవత్సరాల పాటు అమలయ్యేలా నవ భారత్ సాక్షరతా కార్యక్రమం ఉల్లాస్‌ను ప్రారంభించిందన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి దీనిలో 15 సంవత్సరాల వయస్సు పైబడిన వారందరికి సాక్షరులుగా చేయాలనేది ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమం 5 లక్ష్యాలను కలిగి ఉందన్నారు. ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్య, నిరంతర విద్య కీలకమైన జీవన నైపుణ్యాలు, వృత్తి విద్యా నైపుణ్యాలు దేశంలో ఈ కార్యక్రమాన్ని సమర్దవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం రకరకాల చర్యలు తీసుకుంటుందన్నారు. లబ్దిదారులను, వాలంటీర్లను ఎంపిక చేయడం మొదటి దశని, వాలంటీర్లుగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, గ్రామంలో చదువుకున్న యువతి యువకులు, అంగన్‌వాడీ టీచర్లు, పదవీ విరమణ పొందినవారు. గ్రామంలోని పాఠశాలను ఒక యూనిట్‌గా తీసుకుంటామన్నారు. అక్కడ లబ్దిదారులకు అనూకులమైన సమయంలో పఠన కేంద్రాలను నిర్వహిస్తారు అన్నారు. ఇది పూర్తిగా ఉచితం, వాలంటీర్లుగా బోధన చేసే వారికి క్రెడిట్లు ఇవ్వబడుతాయి అన్నారు. బోధనా కార్యక్రమం హై బ్రిడ్ పద్దతి అంటే, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కొనసాగుతుందన్నారు. చదువు పూర్తి చేసిన తరువాత ఎన్ఐఓఎస్ ద్వారా పరీక్ష పెట్టి పాసయిన వారికి సర్టిఫికెట్ ఇస్తారన్నారు. చదువుకోవడానికి అవసరమైన వాచకాలు, బోధన అభ్యసన సామాగ్రి మొత్తం ఉచితంగా పంపిణీ చేయబడుతుందన్నారు. అంతేకాకుండా ఎన్‌సిఈఆర్‌టీ వారి దీక్షా పోర్టల్ నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమ ప్రచారానికి సోషల్ మీడియా అయిన ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సప్, ఇన్స్టాగ్రాం, ట్విట్టర్ అన్నింటిని విరివిగా వాడుకుంటున్నారని ఇవే కాకుండా రేడియో, దూరదర్శన్ ద్వారా కూడా ప్రచారం చేస్తారన్నారు. ముఖ్యంగా మహిళా అక్షరాస్యత తక్కువగా ఉన్న జిల్లాలు, మండలాలు, వెనుకబడిన వర్గాలు ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు ఎవరయితే చదువుకు నోచుకుని వారున్నారో వారిని ముందుగా అక్షరాస్యులను చేయడం జరుగుతుందన్నారు. ఈ 5 సంవత్సరాల కాలంలో ఒక ఉద్యమ రూపంలో చదువుకున్న ప్రతి ఒక్కరు తమ సామాజిక బాధ్యతగా భావించి చదువురాని వారికి చదువు నేర్పినట్లయితే మన తెలంగాణ రాష్ట్రం మన జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షరాస్యతలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అన్నారు.



వయోజన విద్య జిల్లా ప్రాజెక్టు అధికారి కే.అనిత, జడ్పీచైర్మన్ సరితతో మాట్లాడుతున్న పిఓ కే. అనిత

## ప్రధాన పార్టీల అధ్యక్ష పదవులు బిసిలకు ఇవ్వాలి

**బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ సాగర్ డిమాండ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 02 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు రాష్ట్రంలో బిసిలకే అవకాశం కల్పించి రాష్ట్ర అధ్యక్షులుగా వెంటనే ప్రకటించాలని బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్‌సాగర్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలన్ని బిసివాదం వైపు చూస్తున్న ఈ తరుణంలో రాష్ట్ర జనాభాలో 50 నుంచి 55 శాతం ఉన్న బిసిలకు తగిన ప్రాధాన్యత కల్పించి రాష్ట్ర అధ్యక్షులుగా బిసిలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్‌రెడ్డి ఉన్నందున రాష్ట్ర అధ్యక్షునిగా బిసి వ్యక్తులకు అవకాశం కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిసిలకు ఎక్కడ తగిన ప్రాధాన్యత లేదని గుర్తు చేస్తూ నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా బిసిలే వివక్షతకు గురయ్యారని పదోన్నతుల విషయంలో కూడా అన్యాయానికి గురయ్యారని, మంత్రి మండలిలో కూడా తగిన ప్రాధాన్యత లేకుండానే ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే బిసిని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించి బిసిల పక్షాన నిలిచిన సంగతి తెలిసిందే అని గుర్తు చేస్తూ ప్రస్తుతం బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా బిసి అభ్యర్థిని వెంటనే ప్రకటించాలన్నారు. పార్టీలో మళ్లీ అగ్రవర్ణాలకి అధ్యక్ష బాధ్యతలప్పగించాలని ఒక వర్గం చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని అలాగే బలమైన బిసి నేతకు అధ్యక్ష బాధ్యతలు ఇస్తున్నారని బిసి సమాజ్ భావిస్తుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపిగా ఒకే పార్టీని నమ్ముకుని, హిందూ భావజాలంతో ఆర్ఎస్ఎస్ వాదిగా, అవకాశాల కోసం పార్టీలు మారే వ్యక్తిగా కాకుండా ఉన్న బలమైన బిసి నాయకుడు శాంతికుమార్‌కి కనుక సీటు కేటాయించి ఉంటే లక్షకు పైగా మెజార్టీతో గెలిచి ఈరోజు కేంద్ర మంత్రిగా ఉండేవారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా ఉన్న బిసి జనాభాను దృష్టిలో ఉంచుకొని మహబూబ్‌నగర్ ఎంపిగా బిసి బిడ్డ మల్లికార్జున్‌కి అవకాశం కల్పించి గెలిపించుకుని కేంద్ర మంత్రిని చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టిఆర్ఎస్ పార్టీ రెండుసార్లు అధికారం అనుభవించి ప్రస్తుతం కనుమరుగయ్యే పరిస్థితిలో ఉందని గుర్తు చేస్తూ ఇప్పటికైనా బిసి అభ్యర్థికి టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యత అప్పజెప్పి కుటుంబ పాలన పార్టీగా మారేందుకు ఇదొక మంచి అవకాశమని శ్రీనివాస్‌సాగర్ అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న ముదిరాజ్, బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సవారి సత్యం పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌సాగర్

## ఐదేళ్లలో గణనీయ అభివృద్ధి,,!!

**- నేటితో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపిపి కదిరే..- నేడు పదవీ విరమణ చేయనున్న ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి..**

**భూత్పూర్, జూలై 2, ప్రభాతవార్త :** గడిచిన ఐదేళ్ల తన పదవీకాలంలో మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి మండలాన్ని గణనీయమైన అభివృద్ధి పథంలో నడిపించానని ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం 3వ తేది పదవీ విరమణ చేయనున్న భూత్పూర్ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి మంగళవారం ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడు తూ తన ఐదేళ్ల కాలంలో రు.రెండున్నర కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. తాను ఖర్చు చేసిన నిధుల్లో ఎక్కువ శాతం విద్యకు కేటాయించి రు.కోటిన్నర నిధులతో పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రు.కోటి ఖర్చు చేసినట్లు ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పది ఎంపీటీసీ సభ్యులు తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించారని పేర్కొన్నారు. తాను తన పదవీకాలంలో ఏ పాఠశాల ఉపాధ్యాయున్ని వేధించలేదని స్పష్టం చేశారు. ఎంపిడిఓ, ఏఈలతో పాటు కిందిస్థాయి సిబ్బంధి తనకు సహ కరించారని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపిలతో సఖ్యతగా ఉంటూ వీలైనన్ని నిధులు మండల పరిషత్ అభివృద్ధి పనులకు రాబట్టినట్లు చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు తనకు సహకరించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్రను పోషించేందుకు ప్రయత్నిస్తానని పదవీవిరమణ చేయనున్న ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి అన్నారు.



## గ్రామపంచాయతీ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలి..

**ఆత్మకూర్ జులై 02 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలో పనిచేస్తున్నటువంటి పంచాయతీ వర్కర్స్ ను తక్షణమే పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రోజు ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలో పనిచేస్తున్నటువంటి వర్కర్లకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలంటూ గత రెండు నెలలుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డిని కలిసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించినటప్పటికి నేటికి అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నెంబర్ 60 ప్రకారం పిఆర్సి నిబంధనల మేరకు తక్షణమే వేతనాలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు అలమటిస్టున్నారని ఆయన అన్నారు. గడిచిన రెండు నెలలుగా పెంచిన వేతనాలు తక్షణమే చెల్లిస్తామంటూ ప్రభుత్వం స్పష్టంగా హామీ ఇచ్చినప్పటికి ఆచరణలో మాత్రం ఏ మాత్రం చర్యలు చేపట్టడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. పంచాయతీ వర్కర్స్ ను తక్షణమే పర్మినెంట్ చేయకపోతే జులై ఐదున రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల పక్షానంలో ఈ నెల 11న రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం హైదరాబాద్ నందు ఆందోళన ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ వర్కర్లను తక్షణమే పర్మినెంట్ చేసి జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలకు తమ బాధ్యత వహించబోమని ఆయన అన్నారు. ఆయన వెంబడి స్థానిక నాయకులు హనుమంతు, రాజు తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగుల సమస్యలపై నిరసన



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం


**మహ్మదాబాద్, జులై02ప్రభాతవార్త:** బిజెవైఎం రాష్ట్రశాఖ పిలుపు మేరకు మహ్మదాబాద్ తహసిల్దార్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు కుర్వ కృష్ణ మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటినుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నానేది జగమెరిగిన సత్యం. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందని, తెలంగాణ యువతకు యువ వికాసం కింద వెంటనే నిరుద్యోగులకు మీరు ఇస్తామన్న నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రభుత్వ నియామకాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలుచేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, పోలీస్ నియామకాల్లో జిఓనం 46ను వెంటనే రద్దుచేయాలని కోరుతూ స్థానిక తహసిల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కృష్ణ, ప్రధానకార్యదర్శి మూస నరసింహ, బిజెవైఎం శ్రీను, హరిప్రసాద్, మైబూ, నవీన్, జయవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్, వికాస్ చౌదరి, శ్రీను, సురేష్, రమేష్‌నాయక్, రాహుల్‌నాయక్, అంజి, ఈశ్వర్, రామస్వామి, శ్రీను పాల్గొన్నారు.

## మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి


**ఆశయానికి అనుగుణంగా కష్టపడి చదవాలి**

**వివిధ భవనాలు ప్రారంభోత్సవం**

**హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



విద్యార్థులతో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కొత్తకోట జులై 02 ప్రభాతవార్త :** విద్యార్థులు మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థానంలోకి వెళ్ళాలని అందుకు ఆశయానికి అనుగుణంగా కష్టపడి చదవాలని దేవరక్ర ఎమ్మెల్యే మధూసుదన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తకోట మండలం అమడబాకుల గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పూజా కార్యక్రమంలో పాల్గొని అనంతరం కస్తూర్బా పాఠశాల పరిశీలించి విద్యార్థులతో సంభాషించారు, ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తుందని చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిది పేరు తీసుకురావాలిని సూచించారు. నాణ్యమైన భోజనం మోనూ ప్రకారం పెట్టకపోతే మా దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పాఠశాలలో ఎలాంటి అవసరాలు ఉన్న మా దృష్టికి తీసుకొస్తే తప్పని సరిగా వాటిని తీరుస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో గౌడ, శాలివాహనన కుల సంఘాల భవన ప్రారంభోత్సవంలో పాల్గొని భవనాలను ప్రారంభించారు. అదేవిధంగా కొత్తకోట మండలం పాలెం గ్రామంలో మరెమ్మ తల్లి బోనాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, సత్య రెడ్డి, మన్యం, కాంగ్రెస్ నాయకులు పల్లెపాగు ప్రశాంత్. మండల అధ్యక్షులు బీచుపల్లి, కృష్ణారెడ్డి, బోయెజ్, మీషెక్, సుభాస్, నరేందర్ రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, సంద వెంకటేష్, ఉమ మహేశ్వర్ రెడ్డి, శివ యాదవ్, మోహన్ రెడ్డి, విశనాథం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మగువలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● మహిళా సంఘాలకు గౌరవప్రదమైన అభ్యున్నతి ● మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి ● పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దనసరి సీతక్క

**అచ్చంపేట, జులై 02 ప్రభాతవార్త:** కోటి మంది మగువలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క అన్నారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని ఏఆర్‌సీ గార్డెన్‌లో నియోజకవర్గంలోని వంగూరు, అచ్చంపేట, అమ్రాబాద్, లింగాల, బల్మూర్, ఉప్పునుంతల, చారకొండ, పదర మండలాల పరిధిలోని 514 మహిళా సంఘాలకు రూ.50.10కోట్ల రుణాలను మండలాల వారిగా చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్కఅందించారు. మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించగా మహిళలతో మహిళల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో మహిళలందరికి నూతన ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఉపాధిని ఆర్థిక ప్రగతిని ఇవ్వాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకైకలక్ష్యమని ఆమె పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలకు గౌరవపదమైన అభ్యున్నతి చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళల సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు మహిళ శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆధార్ కేంద్రాలు, మీసేవా కేంద్రాలు, పౌల్ట్రీ డైరీఫామ్స్, క్యాంటీన్లు తదితర వ్యాపారాలు ఏర్పాటు చేసేందుకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కొత్తగా ప్రారంభించనున్న మహిళా శక్తి క్యాంటీన్లు శుభ్రంగా ఉంచాలని, నాణ్యతమైన ఆహారం అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళా శక్తి క్యాంటీన్లను ఒక బ్రాండ్‌గా మలిచి పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారుల వెంట ఏర్పాటు చేసి స్వచ్ఛమైన పల్లె రుచులను ప్రజలకు అందించాలన్నారు. ప్రజలకు అవసరాలకు తగినట్లుగా మహిళా శక్తి బిజినెస్, మోడల్స్ ఉండాలని, వచ్చే ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్ష కోట్ల రుణాలు అందిస్తామన్నారు. స్థానికంగా లభ్యమయ్యే వస్తువులతో వ్యాపారం చేస్తే అద్భుతాలు సాధించగలమని, మహిళా సంఘాల కోసం బిజినెస్ మోడల్స్‌ను గుర్తించాలని సూచించారు. ఆర్డీఓలు, జిల్లాలో పర్యటించి మహిళా సంఘాల అనుభవాలు తెలుసుకోవాలని సూచించారు. నాగం కర్నూల్ జిల్లాలో ఆదర్శ మహిళ పాఠశాలల పనులను సైతం మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా రూ.30లక్షల స్కూల్ యూనిఫామ్స్‌లను మహిళా సంఘాలతో కుట్టించడం జరిగిందని, మరో 30లక్షల స్కూల్ యూనిఫామ్స్ కుట్టిస్తున్నట్లు ఆమె తెలిపారు. 50లకు జత యూనిఫామ్ ఉంటే ప్రస్తుతం రూ.75లకు పెంచినట్లు తెలిపారు. అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ అప్పటి ప్రధాని పీవీ నర్సింహ్మారావు 1992లో మహిళ అభ్యున్నతికి ద్వాక్రా మహిళా సంఘాలను ఏర్పాటు చేశారని, వైఎస్ హయంలో ఇందిరాక్రాంతి పథకం ఏర్పాటు చేసి మహిళలకు ఆర్థిక సౌలభ్యం కల్పించిన విషయాన్ని గుర్తించారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డిపథకంలో మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కోటీశ్వరులు కావాలన్నారు. కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, జెడ్పీటీసీ అనురాధ, డీఆర్‌డీఏ అధికారులు, మహిళలు తదితరులు ఉన్నారు.


మహిళా సంఘాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి దనసరి సీతక్క

# ప్రభుత్వ ఆసుపత్రులోనే ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి జులై02 ప్రభాతవార్త:** ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు అత్యధికంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్య శాఖ పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పేదవారు ప్రసవాలు కొరకు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వెలకు వేలు వృధా చేసుకుంటున్నారని తద్వారా వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతింటున్నాయని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు వారి పరిధిలోని ప్రతి గర్భిణితో మాట్లాడుతూ వారికి ప్రభుత్వ ఆసుపత్రి పై అవగాహన నమ్మకం కల్పించాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళే ప్రతి వంద మంది గర్భిణుల్లో 75శాతం డిజేరియన్ చేస్తున్నారని తెలిపారు. అదే ప్రభుత్వ ఆసుపత్రిలో 40శాతం ప్రసవాలు సీజేరియన్ ద్వారా జరుగుతున్నాయన్నారు. దీనిని మరింత తగ్గించాల్సిన అవసరం ఉందనిదానికి మరింత తగ్గించాల్సిన అవసరం ఉందని దానికి తోడు ప్రైవేట్ ఆసుపత్రికి కాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిపించేందుకు కృషి చేయాలన్నారు. ఎఎన్‌సి నమోదు చేయించి ప్రసవం జరిగే అంచనా తేదీని నమోదు చేయాలన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూ రక్తహీనత లేకుండా వైద్యం అందించాలన్నారు. ప్రతి పి.హెచ్.సి లో ఉండాల్సిన అన్ని రిజిస్టర్‌లు నిర్ణీత ప్రోఫార్మాలో ఉండాలని ఆదేశించారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రులు, డాక్టర్ల పై నమ్మకం కల్పించాలని అందుకు ఆశా వర్కర్లు, ఏఎన్‌యం లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమయపాలన పాటించి ఉదయం 6గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పక్కగా విధుల్లో ఉండాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రైడే పకడ్బందీగా జరపాలని, జ్వరంతో వచ్చే రోగులకు రక్త పరీక్షలు జరగాలని, జ్వరంతో వచ్చే రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి ఎక్కడైనా డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటివి వస్తే వెంటనే నియంత్రణ చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయచంద్ర మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా వైద్య అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## ఇంఛార్జ్ ఎంఈఓ బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్


ఇంఛార్జ్ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్‌ను సన్మానించిన రిటైర్డ్ ఎంఈఓ

**ఇటిక్యాల జుల్య2 ప్రభాతవార్త:** మండల ఇర్చార్జి ఎంఈఓ గా మంగళవారం ఎంఆర్సి భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఇటిక్యాల ఎర్రవల్లి రెండు మండలాలకు ఇన్చార్జి ఎంఈఓ గా విధులు నిర్వహింస్తున్న ఇ.రాజు ఈనెల 28 వ తేదీన పదవి విరమణ పొందారు. నేపథ్యంలో ఇటిక్యాల.ఎర్రవల్లి 2 మండలాల ఇన్చార్జి ఎంఈఓ గా అల్లంపూర్ మండల ఎంఈఓ గా పనిచేస్తున్న ఆర్. ఆశోక్ కుమార్ కు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఆయన మండలాల ఇన్చార్జి ఎంఈఓ గా బాధ్యతలు తీసుకున్నారు. అందులో భాగంగా పదవి విరమణ పొందిన ఎంఈఓ రాజు నుండి ఇచార్జి తీసుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఎంఈఓ రాజు. కార్యాలయ సిబ్బంది మండలకోఆర్డినేటర్ కాజా. కంప్యూటర్ ఆపరేటర్ హనుమంతు. ఐ.ఇ.ఆర్.పిభాగ్యలక్ష్మి. పిఆర్పిమద్దిలేటి తదితరులు ఆయననుశాలువ పూలములతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక ఎస్.జి.టి ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా మండలానికి కేటాయించిన ఉపాధ్యాయులను నూతన ఇన్చార్జి ఎంఈఓ గా బాధ్యతలు చేపట్టిన ఆర్.అశోక్ కుమార్ బదిలీ పై వచ్చిన ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకున్నారు.

## కరివెనలో వివాహిత అదృశ్యం


అదృశ్యమైన చింతకాయల అమృత

**భూత్పూర్, జులై 2, ప్రభాతవార్త:** మానవత్వ విలువలు మంట కలిసి పోతు న్నాయి. పిచ్చి ప్రేమలు, అక్రమ సంబంధాలు కన్నపేగు బంధాలతో పాటు సంసారాల్ని తుంచుతున్నాయి. ఇటీవల రెండు నెలల కాలంలో భూత్పూర్ పీఎస్ పరిధిలో యువతులు, మహిళల మిస్సింగ్ కేసులు బాగానే నమోద వుతున్నాయి. తాజాగా భూత్పూర్ మండలం కరివెన గ్రామానికి చెందిన చింతకాయల అమృత ఈ నెల ఒకటవ తేది నుంచి కనిపించకుండా పోయిందని, ఆమె భర్త చింతకాయల విష్ణుకుమార్ మంగళవారం భూత్పూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. తనకు 2017లో బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన అమృతతో వివాహమైందని, తమకు ఇద్దరు అఖిల్ తేజ(7), శ్రావ్యశ్రీ(6)సంతామని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నెల ఒకటవ తేది తాను ఉదయం టీ తాగడానికి బయటకు వెళ్లగా, తాను ఇంట్లోలేనిది చూసి ఇద్దరు పిల్లల్ని వదిలేసి ఎవరికి చెప్పకుండా తన భార్య అమృత ఇంట్లో నుంచి వెళ్లి పోయిందని విష్ణుకుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. విష్ణుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు భూత్పూర్ పోలీస్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మక్తల్ విద్యార్థులు

**మక్తల్, జులై 02 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి లో ప్రవేశం కొరకు జూన్ 29న నారాయణపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలలో మక్తల్ నియోజకవర్గం నుండి 18 మంది బాల బాలికలు పాల్గొని, 9 క్రీడాంశాలలో అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలకు 15 మంది బాలబాలికలు ఎంపికైనట్లు విశ్రాంత పీఈటి బి. గోపాలం మంగళవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలలకు ఎంపికలో పాల్గొనుటకు ఎంపికైన బాల బాలికలు ఈనెల 11, 12 తేదీలలో హైదరాబాద్ హకీంపేట క్రీడా పాఠశాలలో జరిగే ఎంపికలలో పాల్గొంటారని బి. గోపాలం తెలిపారు. బాల బాలికలు బోనఫైడ్, ఆధార్‌కార్డు, కులం, జనన ధృవీకరణ పత్రం, 5 ఫొటోలతో ఈనెల 11న ఉదయం 7 గం.లకు హకీంపేట క్రీడా పాఠశాలలో రిపోర్టు చేయాలని బి. గోపాలం తెలిపారు. వీరికి ప్రతి రోజు 9 క్రీడాంశాలలో మెరుగైన శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపిక కావడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. మెరుగైన శిక్షణ ఇచ్చే కోచులు అమ్రేష్, దామోదర్‌ను విద్యార్థులను ఎమ్మెల్యే శ్రీహరి, డివైఎస్ఓ వెంకటేష్‌శెట్టి, బి.గోపాలం అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

# ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

● యువమోర్చా జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి

**మిడ్జిల్, జులై 02 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నీళ్ళు, నిధులు నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి అన్నారు. మంగళవారం మిడ్జిల్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రాజు నాయక్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. మోసాలను ఎండగడుతూ తెలంగాణ యువత తరపున, నిరుద్యోగుల తరపున బిజెవైఎంగతకొన్ని సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూనే ఉందని ఆయన అన్నారు. నియంతృత్వ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా కాలం గడిపేస్తూ నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన అన్నారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి. గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలి. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్ట్ పోన్‌చేసి నూతన తేదీలను ప్రకటించాలని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33% రిజర్వేషన్ కేటాయించాలి. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జిఓ నం.46ను వెంటనే రద్దు చేయాలి. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బిజెపి మండల అధ్యక్షులు కావలి నరెందర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు నరేష్ నాయక్, మండల ప్రధానకార్యదర్శి వాసుదేవ్‌యువమోర్చా నాయకులు పిట్టల ఆంజనేయులు, మల్లేష్, గొడుగుశివ, శ్రీనివాస్, కిట్టు, ఆంజనేయులు, అరవింద్, మల్లేష్, యాదయ్య, చందునాయక్, సిద్ధు, లక్పతి నాయక్, మల్లేష్ నాయక్, రాము హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటమాడుతోంది

**బిజెవైఎం నాయకుల ఆరోపణ**

**డీఎస్సీ పోస్ట్‌పోన్ చేసి మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్**

**బాలానగర్ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేత**

**బాలానగర్, జులై 02 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతుందని పలువురు బిజెవైఎం నాయకులు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలపై మంగళవారం బాలానగర్ మండల తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటినుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందన్నారు. నిరుద్యోగ సమస్యలను జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకువెళ్ళమని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి, గ్రూప్2,3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలి, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్టుపోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జిఓ నం.46ను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో బిజెవైఎం మండల అధ్యక్షుడు సభావత్ కుమార్‌నాయక్, బిజెపి మండల సెక్రెటరీ రవిందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి కటోజు భరత్‌సింహచారి, బిజెపి జిల్లా బిజెపి జిల్లా నాయకులు సురేష్‌నాయక్, మండల ఐటిసెల్ శ్యాంప్రసాద్, సెక్రెటరీ వెంకటేష్, రఘు, కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, కేతిరెడ్డిపల్లి బూత్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, హేమాజీపూర్ బూత్ అధ్యక్షుడు కిషన్‌నాయక్, బిజెవైఎం నాయకులు రాము, కిశోర్‌యాదవ్, ఆర్యనాయక్, కుమార్ నాయక్, మధు, శ్రీను, శ్రీరామ్, రవి, చంద్రకాంత్, శివ, హరిచందర్, రోహిత్, రాజేష్ తదితరులు బిజెపి, బిజెవైఎం నాయకులు పాల్గొన్నారు.


వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

# రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా

● జిల్లా సహకార అధికారి రఘునాథరావు


మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి రఘునాథరావు

**బిజినేపల్లి, జులై 02 ప్రభాతవార్త:** రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా అందించేలా ప్రభుత్వం ప్రత్యేక సర్వసభ్య సమావేశాలను ఏర్పాటు చేసిందని జిల్లా సహకార అధికారి రఘునాథరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో మంగళవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అర్హులకు మాత్రమే అందే విధంగా క్షేత్రస్థాయిలో రైతుల సూచనలు, సలహాలను సేకరించి రైతు భరోసా అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎన్. బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ రైతుబంధు తరహాలో కాకుండా, ప్రజాధనం ఎక్కడ దుర్వినియోగం కాకుండా, అర్హులైన రైతులకు రైతుభరోసా అందేలా పటిష్ట విధానాలను రూపొందించేందుకు ప్రభుత్వం నేరుగా ప్రత్యేక సర్వసభ్య సమావేశాలను ఏర్పాటు చేసి రైతుల సూచనలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆలస్యమైనా అర్హులకు రైతులకు మాత్రమే అందేలా ప్రభుత్వం రూపకల్పన చేస్తుందన్నారు. సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ పంటలు సాగు చేసేవారికి, సాగులో ఉన్న భూములకే రైతుభరోసా అందించాలని కోరారు. కౌలు రైతులకు సంబంధించి సాగు చేసే రైతుకే రైతు భరోసా అందేలా చూడాలని కౌలు రైతులు కోరారు. ఆదాయపు పన్ను చెల్లించే వారికి చెల్లించవద్దని కొందరు కోరగా ట్రాక్టర్ల రుణాలకు ఐటీ రిటర్నులు తప్పనిసరి చేసిన నేపథ్యంలో వారికి రైతు భరోసా వర్తింపజేయాలని మరికొందరు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించవద్దని రైతుబంధు తరహాలో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, రైతుభరోసాకు పటిష్ట విధానాలను అమలు చేయాలని రైతులు కోరారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్టర్ రాజశేఖర్, ఏఓ నీతిరెడ్డి, సీఈఓరవిందర్, సహకారసంఘం డైరెక్టర్లు నవీన్‌రెడ్డి, మలిశెట్టి వెంకటస్వామి, నర్సింహారెడ్డి, రామ్‌రెడ్డి, వంగదామోదర్‌గౌడ్, దీప్లానాయక్, బొందయ్యసత్యనారాయణరెడ్డి, లక్ష్మీదేవమ్మ, ఉషన్న, మణెమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రైతులు

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


ఎంపిపి, ఎంపిటిసి సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్, జులై02 ప్రభాతవార్త:** మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా ముగిసింది. ఎంపిపి, ఎంపిటిసి సభ్యుల పదవి కాలం చివరి దశకు చేరుకోవడంతో ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. ఈ మాత్రం చర్చ జరగకుండానే సమావేశాన్ని ముగించారు. అనంతరం ఎంపిపి వనజ, ఎంపిటిసి సభ్యులను అధికారులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. తమ ఐదేళ్ల పదవీ కాలంలో మండల అభివృద్ధికి చేసిన పనులపై సభ్యులు అధికారులవద్ద నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ సువర్ణరాజు, ఎంపిడిఓగోవిందరావు, వైస్ ఎంపిపి రామేశ్వరమ్మ, ఎంపిటిసి సభ్యులు జి. బలరాంరెడ్డి, లక్ష్మినర్సిరెడ్డి, ఆశిరెడ్డి, రంగప్ప, రామలింగప్ప, పద్మమ్మ, పార్వతమ్మ, తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మదాసి మదారి కురువల హక్కులకై ఐక్యం కావాలి

**మాదాసి కురువ రాష్ట్ర నాయకులు పెద్ద మల్లయ్య**



**కొల్లాపూర్, జులై 02 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేసి రాజ్యాంగ బద్ధంగా సంక్రమించే హక్కులను పరిరక్షించాలని తెలంగాణ మదాసి, మదారి కురువ రాష్ట్ర సీనియర్ నాయకులు పెద్ద మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి మాదాసి, మాదారి కులస్థులంతా ఏకతాటిపై నిలిచి సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొల్లాపూర్ మున్సిపాలిటీమాధవస్వామి గుడిలో మంగళవారం జిల్లా, తాలూకా నాయకులతో కలిసి ఆయన సమావేశం అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపిలో మాదిరిగా మాదారి, మాదాసి కురువలకు తహసిల్దార్‌ల ద్వారా ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులపత్రాలు జారీ చేసిఆయా కులస్థుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని కోరారు. సమావేశంలో రాముడు, స్వాములు, మల్లయ్య, వెంకటస్వామి, బాలపీరుఈదన్న, సొంటేఎల్లయ్య పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే రైతులకు రైతు భరోసా అందించాలి


మాట్లాడుతున్న సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**కోయిల్‌కొండ, జులై 02 ప్రభాతవార్త:** పాత పద్ధతిలోనే సాగు చేసే రైతులందరికి రైతు భరోసా పథకాన్ని అందించాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని గార్లపాడు సింగిల్‌విండో కార్యాలయంలో రైతుభరోసా పథకంపై ప్రత్యేక మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మండల సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన కొనసాగింది. ఈ సమావేశానికి మండల వ్యవసాయ శాఖ అధికారి రాంపాల్ హాజరయ్యారు. మండలంలోని అన్ని క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు సైతం హాజరయ్యారు. సమావేశానికి రైతులు హాజరై వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆంక్షలు పెట్టకుండా వ్యవసాయం చేసే రైతులందరికి రైతుబంధు పథకం వర్తింపజేయాలని రైతులు సూచించారు. మరికొంత మంది రైతులు 20 ఎకరాల్లోపు ఉన్న రైతులందరికి రైతుబంధు పథకం వర్తింపజేయాలన్నారు. మరికొంతమంది రైతులుగత ప్రభుత్వం మాదిరి గానే రైతు భరోసా పథకం అందించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలోసింగిల్ విండోడైరెక్టర్ గోపాల్‌నాయక్, ఆశన్నగౌడ్, సీఈఓ శ్రీరాంకుమార్, సేల్స్‌మెన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



**వెల్దండ, జులై 02 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో మహిళా సంఘం భవన్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్వహణ కొనసాగుతోంది. నూతన భవనంలోకి మార్చుటకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి క్వార్టర్స్‌లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహకు వినతి పత్రం అందించారు. ఆయన వెంట మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్‌లు యెన్నం భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్, కల్వకుర్తి కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## పీయూలో రవాణా నమూనాల ప్రదర్శన





**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 2, ప్రభాతవార్త:** పాలమూరు యూని వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ ఫైన్ ఇయర్ విద్యార్థులు మంగళవారం సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో రవాణా నమూనాలను ప్రదర్శించారు. రవాణా మార్గాలు, వాయు మార్గాలు, నీటి మార్గాలు, పైప్‌లైన్ ఉన్నాయి. ఎంబీఏ విద్యార్థులు అందుబాటులో ఉన్న థర్మకోల్, కాగితం మెటీరీయల్ ఉపయోగించి వినూత్నమైన, సృజనాత్మకమైన పద్ధతిలో నమూనాలను సిద్ధం చేశారు. ఈసందర్భంగా డా.కే నాగసుధ, డా.ఎస్ఎన్ అర్జున్‌కుమార్ స్టాల్‌ను ప్రారంభించి ప్రదర్శనను తిలకించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను సిబ్బందిని ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, డా ఎం కృష్ణయ్య అభినందించారు.

## అమ్మకు ప్రేమతో..

**- డా.బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన ప్రిన్సిపాల్**



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ అప్పియ చిన్నమ్మ, సదాశివయ్య

**జడ్చర్ల, జూలై 2, ప్రభాతవార్త:** ప్రదాని మోడీ పిలుపుమేరకు అమ్మకు ప్రేమతో ఒక మొక్క కార్యక్రమాన్ని జడ్చర్లలోని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అప్పియ చిన్నమ్మ, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య మొక్కలు నాటి నీళ్లు పోశారు. కళాశాలలో ఇప్పటి వరకు సుమారు 6వేలకు పైగా మొక్కలు నాటి పెంచి తీర్చిదిద్దిన ఘనత తమ కళాశాలకు దక్కుతుందన్నారు. మన్ కీ బాత్‌లో భాగంగా మోడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ తల్లి కోసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు లత, వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

## పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్

**- సిద్ధిరామగౌడ్‌ను అభినందించిన రిజిస్ట్రార్**



సిద్ధిరామ గౌడ్‌కు అభినందిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 2, ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగంలో గత పదేండ్లుగా అధ్యాపకుడిగా పనిచేస్తున్న బీ సిద్ధిరామ గౌడ్ తెలంగాణ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. ఇతని తల్లిదండ్రులు ఆశగౌడ్, వెంకటలక్ష్మి. సిద్ధి రామ గౌడ్ డిగ్రీ కామారెడ్డిలో, పీజీ ఉస్మానియాలో పూర్తి చేశాడు. 2018లో సెట్ ద్వారా తెలంగాణ యూనివర్సిటీలో వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందాడు. పారిశ్రామిక రంగంలో అతితక్కువ ఖర్చుగల మిశ్రమ లోహ ఆక్సైడ్‌ల వినియోగం అనే అంశంలపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈమేరకు మంగళవారం సిద్ధిరామ గౌడ్‌కు పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అభినందించి మరిన్ని పరిశోధనలు చేయాలనిసూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చంద్ర కిరణ్, డా. అర్జున్‌కుమార్, డా. ఈశ్వర్, డా. కర్ణాకర్, వెంకటేశ్, సుదర్శన్‌రెడ్డి, అయేశా హష్మి, సోమేశ్ పాల్గొన్నారు.

## అధ్యక్ష పదవులు బిసిలకు ఇవ్వాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 02 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు రాష్ట్రంలో బిసిలకే అవకాశం కల్పించి రాష్ట్ర అధ్యక్షులుగా వెంటనే ప్రకటించాలని బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్‌సాగర్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బిసివాదం వైపు చూస్తున్న ఈ తరుణంలో రాష్ట్ర జనాభాలో 50 నుంచి 55 శాతం ఉన్న బిసిలకు తగిన ప్రాధాన్యత కల్పించి రాష్ట్ర అధ్యక్షులుగా బిసిలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్‌రెడ్డి ఉన్నందున రాష్ట్ర అధ్యక్షునిగా బిసి వ్యక్తులకు అవకాశం కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిసిలకు ఎక్కడ తగిన ప్రాధాన్యత లేదని గుర్తు చేస్తూ నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా బిసిలే వివక్షతకు గురయ్యారని పదోన్నతుల విషయంలో కూడా అన్యాయానికి గురయ్యారని, మంత్రి మండలిలో కూడా తగిన ప్రాధాన్యత లేకుండానే ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే బిసిని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించి బిసిల పక్షాన నిలిచిన సంగతి తెలిసిందే అని గుర్తు చేస్తూ ప్రస్తుతం బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా బిసి అభ్యర్థిని వెంటనే ప్రకటించాలన్నారు. పార్టీలో మళ్లీ అగ్రవర్ణాలకి అధ్యక్ష బాధ్యతలప్పగించాలని ఒక వర్గం చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని అలాగే బలమైన బిసి నేతకు అధ్యక్ష బాధ్యతలు ఇస్తున్నారని బిసి సమాజ్ భావిస్తుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌ఎంపిగా ఒకేపార్టీని నమ్ముకుని, హిందూ భావజాలంతో ఆర్ఎస్ఎస్ వాదిగా, అవకాశాల కోసం పార్టీలు మారే వ్యక్తిగా కాకుండా ఉన్న బలమైన బిసినాయకుడు శాంతికుమార్‌కి కనుకసీటు కేటాయించిఉంటే లక్షకు పైగా మెజార్టీతో గెలిచి ఈరోజు కేంద్ర మంత్రిగా ఉండేవారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా ఉన్న బిసి జనాభాను దృష్టిలో ఉంచుకొని మహబూబ్‌నగర్ ఎంపిగా బిసి బిడ్డ మల్లికార్జున్‌కి అవకాశం కల్పించి గెలిపించుకుని కేంద్ర మంత్రిని చేసిన విషయాన్నిఆయన గుర్తుచేశారు. టిఆర్ఎస్ పార్టీ రెండుసార్లు అధికారం అనుభవించి ప్రస్తుతం కనుమరుగయ్యే పరిస్థితిలో ఉందని గుర్తు చేస్తూ ఇప్పటికైనా బిసి అభ్యర్థికి టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యత అప్పజెప్పి కుటుంబ పాలన పార్టీగా మారేందుకు ఇదొక మంచి అవకాశమని శ్రీనివాస్‌సాగర్ అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న ముదిరాజ్, బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సవారి సత్యం పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యలపై వినతి



**అడ్డాకుల, జూలై 2, ప్రభాతవార్త:** బీజేవైఎం అడ్డాకుల మండల అధ్యక్షుడు చెన్నకేశవ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలపై తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మంగళవారం కార్యాలయం ఆవరణలో బీజేవైఎం అడిషనల్ సెక్రెటరీ అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డ నాటి నుంచే నీళ్లు నిధులు నియామకాలు అంటూ నిరుద్యోగులను మోసం చేస్తూ వస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతిలో తమ కార్యకలాపాలు సాగిస్తున్నదని పేర్కొన్నారు. నిరుద్యోగులను పట్టించుకోకుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని చెప్పారు. ఈమేరకు పలు సమస్యలతో కూడిన వినతిప్రతాన్ని తాసిల్దార్ మదన్ మోహన్‌గౌడ్‌కు అందజేశారు. తమ సమస్యలను కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, నాయకులు రాఘువేందర్‌రెడ్డి, యశ్వంత్, నరేందర్, సాయిరాం, సల్మాన్, పవన్ సాగర్, శశాంక్, విజయ్ పాల్గొన్నారు.

**మహ్మదాబాద్, జులై02ప్రభాతవార్త:** బిజెవైఎం రాష్ట్రశాఖ పిలుపు మేరకు మహ్మదాబాద్ తహసిల్దార్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్య క్షుడు కుర్వ కృష్ణ మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటినుంచి నేటి వరకు నియా మకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నానేది జగమెరిగిన సత్యం. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందని, తెలంగాణ యువతకు యువ వికాసం కింద వెంటనే నిరుద్యోగులకు మీరు ఇస్తామన్న నిరుద్యోగ భృతి చెల్లిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కృష్ణ, ప్రధానకార్యదర్శి మూస నరసింహ, బిజెవైఎం శ్రీను, హరిప్రసాద్, మైబూ, నవీన్, జయవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్, వికాస్‌చౌదరి, శ్రీను, సురేష్, రమేష్ నాయక్, రాహుల్‌నాయక్, అంజి, ఈశ్వర్, రామస్వామి, శ్రీను పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలి

- **జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**
- **జోగులాంబ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తా : జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య**
- **జడ్పిటీసి సభ్యులకు ఘనంగా సన్మానం**



జిల్లా కలెక్టర్ సంతోష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి జులై2 ప్రభాతవార్త:** జిల్లా అభివృద్ధికీ అందరూ సభకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా పరిషత్ సభ్యుల పదవి కాలం ముగుస్తుండటంతో మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సన్మానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పి చైర్మన్ సరిత, వైస్ చైర్మన్ సరోజ, జడ్పిటిసి లు రాజశేఖర్, రాజు, హన్మంత్‌రెడ్డి, సుజాత, బాసు శామల తదితరులను కలెక్టర్, సీఈఓ కాంతమ్మలు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ గ్రామీన ప్రాంతాలు, మండల కేంద్రాలు అభి వృద్ధి లో జడ్పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్ ల కృషి ఉంటు ందని అన్నారు. అన్ని స్థాయిల అధికారులు, ప్రజాప్రతి నిధులు, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధి సాధ్య పడుతుంది అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధి కి ఎళ్ళ వేలల కృషి చేస్తా చైర్మన్ సరిత జోగులాంబ గద్వాల జిల్లా అభి వృద్ధికి ఎళ్ళవేలల కృషి చేస్తాను అని జడ్పి చైర్మన్ సరిత అన్నారు. తాను మొదటి ప్రయత్నం లోనే ప్రజల ఆవశీస్సులతో కాబినెట్ మంత్రి ర్యాక్ కలిగిన హోదా పదవిలో ఉంటూ ఐదు సంవత్సరాలు అన్ని వర్గాల ప్రజలకు సేవ చేసి, జిల్లాను అభివృద్ధి పథకంలో తీసుకొని వెళ్లడం జరిగింది అన్నారు. భవిష్యత్తులో కూడా జిల్లాలో అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నదని, ఐదు సంవత్సరాలు కూడా జిల్లాలను అమలు చేస్తా అన్నారు. ఈజిల్లా అధికారులు డిఆర్డిఓ నర్సింగరావు, పోయిన విద్య ప్రాజెక్టు అధికారి అనిత, సివిల్ సప్లై అధికారి విమ ల, పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వరరావు బీసీ సంక్షేమ శాఖఅధికారి శ్వేతా ప్రియదర్శని, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి రమేష్, మత్స్య శాఖఅధికారి షకీలా, వైద్యాఆరోగ్యశాఖ శశికళ, ఆసుపత్రి సూపర్డెంట్ నవీన్‌క్రాంతి, చేనేత శాఖ అధికారి గోవింతయ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యాదగిరి, కెవిఐబి అధికారి శాంతి రాజ్, ఎంపీడిఓ చెన్నయ్య, మిషన్ భగీరథ ఈఈ భీమేష్‌రావు పాల్గొన్నారు.



జడ్పిటీసిల సన్మానం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్యను సన్మానిస్తున్న దృశ్యం

# సైనికుల సేవలు వెలకట్టలేనివి..

- **వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ**



పదవి విరమణ పొందిన రంగరాతి తిరుపతయ్యను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, జూలై 02 ప్రభాతవార్త:** దేశ సైనికుల సేవలు అమరమని, వారి సేవలు వెలకట్టలేమని వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు అన్నారు. వెల్దండ మండల కేంద్రానికి చెందిన రంగరాతి తిరుపతయ్య పదవి విరమణ కార్యక్రమాన్ని వెల్దండ మండల కేంద్రంలో సైనికులు, మాజీ సైనికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో పదవి విరమణ పొందిన మాజీ సైనికుడు తిరుపతయ్యను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆకృతి గార్డెన్‌లో పదవి విరమణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు ముఖ్యఅతిథులుగా హజరై తిరుపతయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం కుటుంబాన్ని వదిలి రాత్రింబవళ్లు దేశానికి కంటి రెప్పల కాపాడుతున్న సైనికుల త్యాగం ఎంతో గొప్పదన్నారు. మన గ్రామం నుంచి పెద్ద ఎత్తున యువకులు దేశ సైన్యంలో పనిచేయడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని రానున్న రోజుల్లో భవిష్యత్తులో సైన్యంలో చేరడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే గ్రామంలో వీరి పేరిట డిఫెన్స్ కాలనీతో పాటు సైనిక సంక్షేమ భవనం కోసం స్థలాన్ని సేకరించామని, త్వరలోనే భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలోబీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, విజయేందర్‌రెడ్డి, సింగిల్‌విండోవైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు క్యాసారపు వెంకటయ్య, కృష్ణ ముదిరాజ్, రషీద్, ఎర్రశ్రీను, యాదగిరి, సైనికులు ఎం. చంద్రశేఖర్‌గౌడ్, పురుషోత్తం, మన్సూరూ, గణేష్, ఆర్. శ్రీను, ప్రవీణ్‌రెడ్డి, విజయ్, ఆంజనేయులుతో పాటు తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**



ఆలయ ఆవరణంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**ఉప్పునుంతల, జూలై 2, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని పంచాయతీరాజ్‌శాఖమంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం రాత్రి బల్మూరు మండలం జీనుకుంట స్టేజీ నుంచి పోలెపల్లి, మామిళ్లపల్లి, దాసరపల్లి మీదుగా రామగిరి వరకు రూ. 3.60కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, 2.97కోట్లతో ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు చేపట్టిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం, రూ. 49లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ గోదాంను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ప్రారంభించారు. అంతరం మామిళ్లపల్లి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో రూ. 20లక్షలతో నిర్మించినున్న మండపానికి భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రాజల్‌రావు మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఉప్పరిపల్లి పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. సీఐ రవీందర్, ఎస్సై లెనిన్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీరాజ్ అధాకారికృష్ణ, బీఎల్‌పీవో వెంకటయ్య, డీఈఈ చంద్రకళ, శివసేనారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ సత్తుభూపాల్‌రావు, తాసిల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో బాల చందర్, ఎంఈవో రామారావు, ఎంపీవో నారాయణ, ఏపీవో సుదర్శన్‌గౌడ్, జెడ్పీటీసీఅనంతప్రతాపరెడ్డి, నాయకులు మోపత య్య, చిన్నజంగిరెడ్డి, సురేందర్‌రావు, అనంతరెడ్డి, తిప్పర్తి నర్సింహారెడ్డి, అనంత ఇంద్రాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

వారు మొక్కలను నాటి కాపాడలని రైతులు సైతం మొక్కలు నాటి సహకరించాలని ఆయన కోరారు. వృక్షాలు తగ్గితే మనిషి మనుగడ కూడా కష్టతరమే అవుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ విధిగా కనీసం పది చెట్లు నాటి భవిష్యత్తు తరాలకు బాసటగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, జడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు, డిఆర్‌డిఓ నర్సింహులు, డిఎఫ్ఓ సత్యనారాయణ, డిపిఆర్ఓ శ్రీనివాస్, ఆర్‌డిఆర్ నవీన్, తహసిల్దార్ సుందర్‌రాజ్, ఇంఛార్జి ఎంపిడిఓ నరేందర్‌రెడ్డి, మన్యంకొండ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు లయన్ నటరాజ్, లయన్ బాబుల్‌రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్ జడ్పీ ఛైర్పర్సన్



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న విద్యార్థులు

## ప్రమాదవశాత్తు పచ్చిగడ్డి యంత్రంలో పడి తెగిన కుడిచేయి



అరచేతి హస్తం తెగి పడిన దృశ్యం

**వెల్దండ, జూలై 02 ప్రభాతవార్త:** పాడి పశువుల దాన కోసం పచ్చిగడ్డి యంత్రం లో వేస్తుండగా కుడిచేయి హస్తం తెగిన సంఘటన మండలంలోని పల్గుతాండలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన రామావత్ బుజ్జి (42) ఉదయం సమయంలో పాడి పశువుల కోసం గడ్డి మిషన్‌లో గడ్డి వేస్తుండ గా ప్రమాదవశాత్తు అరచేతి తెగిపడటంతో గమనించిన కుటుంబ సభ్యులు బుజ్జిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

## బాలానగర్ తహసీల్దార్‌కు వినతి

**బాలానగర్, జులై 02 ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా వారి జీవితాలతో చెలగాట మాడుతుందని పలువురు బిజెవైఎం నాయకులు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలపై మంగళవారం బాలా నగర్ మండల తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటినుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపించి నట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందన్నారు. నిరుద్యోగ సమస్యలను జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకువెళ్ళమని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి, గ్రూప్2,3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలి, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహిం చాలి. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్టుపోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జిఓ నం. 46ను వెంటనే విడుదల చేయాలని కాంగ్రె స్ ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో బిజెవైఎం మండల అధ్య క్షుడు సభావత్ కుమార్‌నాయక్, బిజెపి మండల సెక్రెటరీ రవిందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి కటోజు భరత్‌సింహచారి, బిజెపి జిల్లా బిజెపి జిల్లా నాయకులు సురేష్‌నాయక్, మండల ఐటిసెల్ శ్యాం ప్రసాద్, సెక్రెట రీ వెంకటేష్, రఘు, కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, కేతిరెడ్డిపల్లి బూత్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, హేమాజీపూర్ బూత్ అధ్యక్షుడు కిషన్ నాయక్, బిజెవైఎం నాయకులు రాము, కిశోర్‌యాదవ్, ఆర్యనాయక్, కుమార్ నాయక్, మధు, శ్రీను, శ్రీరామ్, రవి, చంద్రకాంత్, శివ, హరిచందర్, రోహిత్, రాజేష్ తదితరులు బిజెపి, బిజెవైఎం నాయకులు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే రైతు భరోసా అందించాలి

**కోయిల్‌కొండ, జులై 02 ప్రభాతవార్త:** పాత పద్ధతిలోనే సాగు చేసే రైతు లందరికి రైతు భరోసా పథకాన్ని అందించాలని రైతులు తమ అభిప్రా యాలను వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని గార్లపాడు సింగిల్‌విండో కార్యాలయంలో రైతుభరోసా పథకంపై ప్రత్యేక మహాజ నసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మండల సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన కొనసాగింది. ఈ సమావేశానికి మండల వ్యవసాయ శాఖ అధికారి రాంపాల్ హాజరయ్యారు. మండలం లోని అన్ని క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు సైతం హాజర య్యారు. సమావేశానికి రైతులు హాజరై వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆంక్షలు పెట్టకుండా వ్యవసాయం చేసే రైతులందరికి రైతుబంధు పథకం వర్తింపజేయాలని రైతులు సూచించారు. మరికొంత మంది రైతులు 20 ఎకరాల్లోపు ఉన్న రైతులందరికి రైతుబంధు పథకం వర్తింపజేయాలన్నారు. మరికొంతమంది రైతులుగత ప్రభుత్వం మాదిరి గానే రైతు భరోసా పథకం అందించి రైతులకు న్యాయం చేయాల న్నారు. కార్యక్రమంలోసింగిల్ విండోడైరెక్టర్ గోపాల్‌నాయక్, ఆశన్నగౌడ్, సీఈఓ శ్రీరాంకుమార్, సేల్స్‌మెన్ పాల్గొన్నారు.

## రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా

**బిజినేపల్లి, జులై02 ప్రభాతవార్త:** రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా అందించేలా ప్రభుత్వం ప్రత్యేక సర్వసభ్య సమావేశాలను ఏర్పాటు చేసిందని జిల్లా సహకార అధికారి రఘునాథరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం భవనం లో మంగళవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అర్హులకు మాత్రమే అందే విధంగా క్షేత్రస్థాయిలో రైతుల సూచనలు, సలహాలను సేకరించి రైతు భరోసా అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎన్. బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ రైతుబంధు తరహాలో కాకుండా, ప్రజాధనం ఎక్కడ దుర్వినియోగం కాకుండా, అర్హులైన రైతులకు రైతుభరోసా అందేలా పటిష్ట విధానాలను రూపొందించేందుకు ప్రభుత్వం నేరుగా ప్రత్యేక సర్వ సభ్య సమావేశాలను ఏర్పాటు చేసి రైతుల సూచనలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆలస్యమైనా అర్హులకు రైతులకు మాత్రమే అందేలా ప్రభుత్వం రూపకల్పన చేస్తుందన్నారు. ఆదాయపు పన్ను చెల్లించే వారికి చెల్లించవద్దని కొందరు కోరగా ట్రాక్టర్ల రుణాలకు ఐటీ రిటర్నులు తప్పనిసరి చేసిన నేపథ్యంలో వారికి రైతు భరోసా వర్తింపజేయాలని మరికొందరు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించవద్దని రైతుబంధు తరహాలో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, రైతుభరోసాకు పటిష్టవిధానాలను అమలు చేయాలని రైతులు కోరారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్టర్ రాజశేఖర్, ఏఓ నీతిరెడ్డి, సీఈఓరవిందర్, సహకారసంఘం డైరెక్టర్లు నవీన్‌రెడ్డి, మలిశెట్టి వెంకట స్వామి, నర్సింహారెడ్డి, రామ్‌రెడ్డి, వంగదామోదర్‌గౌడ్, దీప్లానాయక్, బొంద య్యసత్యనారాయణరెడ్డి, లక్ష్మీదేవమ్మ, ఉషన్న, మణెమ్మ పాల్గొన్నారు.